సాక్షి
పల్నాడు
సోమవారం : 2 : డిసెంబర్ : 2024



కార్తిక పూజలు

మంగళగిరి : లక్ష్మీనృసింహస్వామి, గంగా భ్రమరాంబసమేత మల్లేశ్వరస్వామి ఆలయాలకు ఆదివారం భక్తులు పోటెత్తారు. కార్తిక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.



పట్టువస్త్రాలు సమర్పణ

దాచేపల్లి: స్థానిక వీర్ల అంకమ్మ అమ్మవారికి ఆదివారం తంగెడ నరసింహారావు దంపతులు పూజలు చేసి పసుపు, కుంకుమతోపాటు పట్టు వస్త్రాలు సమర్పించారు.

మల్లికార్జునస్వామికి అన్నాభిషేకం



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరంలోని మల్లిఖార్జునపేటలో ఉన్న గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వారి దేవస్థానంలో ఆదివారం అన్నాభిషేకం నిర్వహించారు. విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి సీనియర్ ఆట్యాపాట్యా విజేతలుగా జిల్లా జట్లు



నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి సీనియర్ ఆట్యాపాట్యా చాంపియన్‌షిప్ పోటీలలో మహిళలు, పురుషుల విభాగంలో పల్నాడు జిల్లా జట్లు ప్రథమ స్థానాన్ని సాధించినట్టు ఆట్యాపాట్యా జిల్లా కార్యదర్శి వున్నం రోహిత్ జోయెల్ ఆదివారం తెలిపారు. భీమవరంలోని డీఎన్ఆర్ కళాశాల ఆధ్వర్యంలో 11వ రాష్ట్రస్థాయి సీనియర్ ఆట్యాపాట్యా పోటీలు గత నెల 30, ఈనెల 1వ తేదీలలో నిర్వహించారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జిల్లా జట్లు ఫైనల్ పోటీలలో ఆతిథ్య పశ్చిమగోదావరి జిల్లా జట్ల మీద విజయం సాధించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నట్టు వివరించారు. పురుషుల, మహిళల జట్లకు కోచ్‌లుగా సిహెచ్ పుల్లయ్య, జి.ఝాన్సీరాణి వ్యవహరించారు. జిల్లా జట్ల క్రీడాకారులను రాష్ట్ర ఆట్యాపాట్యా సీఈవో రంభ ప్రసాద్, కార్యదర్శి రంభ శ్రీచరణ్, జిల్లా అధ్యక్షులు సీహెచ్ సామ్రాజ్యం అభినందించారు.

ఈతకు వెళ్లి చెరువులో విద్యార్థి గల్లంతు



చినగంజాం: చెరువులో ఈతకు వెళ్లి ఓ విద్యార్థి గల్లంతైన ఘటన ఆదివారం మండలంలోని పర్చూరు మండలం వీరన్నపాలెంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. వీరన్నపాలెం గ్రామానికి చెందిన పాలేరు శ్రీనివాసరావు కుమారుడు జస్వంత్ (17) చీరాల భారతి డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరం డిగ్రీ చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో గ్రామంలోని పడమటి దిక్కునున్న చెరువులో సరదాగా ఈత కొట్టేందుకు సాయంత్రం 5.30 గంటల సమయంలో వెళ్లాడు. ఆ తర్వాత కుమారుడు కన్పించకుండా పోవడంతో తండ్రి శ్రీనివాసరావు చెరువులో వెతికించాడు. సుమారు 10 మంది గజఈతగాళ్లు చెరువులో వెతికినా ఆచూకీ దొరకలేదు. పర్చూరు ఎస్ఐ మాల్యాద్రి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని, చీరాల నుంచి ఫైర్ సిబ్బందిని పిలిపించి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి బాగా పొద్దుపోయేంత వరకు చెరువులో ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది వెతికినా జస్వంత్ ఆచూకీ తెలియరాలేదు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. పాలేరు శ్రీనివాసరావు దంపతులకు ఇద్దరు కుమారులు కాగా జస్వంత్ రెండో కుమారుడు.

రిషితేశ్వరికి న్యాయం చేయాలని డిమాండ్



లక్ష్మీపురం: విద్యార్థిని రిషితేశ్వరికి న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి లక్ష్మణరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ డిమాండ్ చేశారు. రిషితేశ్వరి ఆత్మహత్య కేసు కొట్టివేయటం చాలా బాధాకరమని తెలిపారు. ర్యాగింగ్ తట్టుకోలేక చనిపోయిన విద్యార్థినికి న్యాయం చేయకుండా ఇలాంటి తీర్పు న్యాయస్థానం ఇవ్వటం ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఈ కేసులో నిందితులను శిక్షించాలని ప్రభుత్వం అప్పీలు చేయాలని డిమాండ్ చేశారు. శంకర్ విలాస్ సెంటర్‌లో ఎస్ఎఫ్ఐ, ఐద్వా, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో 2015లో ఆర్కిటెక్చర్ చదువుతున్న రిషితేశ్వరి ర్యాగింగ్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుందని గుర్తుచేశారు. చనిపోయే ముందు సూసైడ్ నోట్‌లో తన ఆత్మహత్యకు కారణం ర్యాగింగ్ అని, సీనియర్ విద్యార్థులు వేధిస్తున్నారని వివరంగా రాసినట్లు తెలిపారు. తొమ్మిది సంవత్సరాలుగా కేసు విచారణ కోర్టులో నడుస్తోందని, ఇప్పుడు కేసు కొట్టి వేయడం చాలా బాధాకరంగా ఉందన్నారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా ప్రభుత్వం అప్పీల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి మద్దతు తెలియజేసిన వారిలో అనూరాధ, స్వాతి, బాషా, ఐద్వా నాయకురాలు రమణ, పద్మ ఉన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్, నగర అధ్యక్షుడు యశ్వంత్, నగర సభ్యులు నరేంద్ర, సుభాని, షంషీర్, శివాజీ, సందీప్, బాబు, రిహాన్, భాను, తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 587.90 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 9,104 క్యూసెక్కులు విడుదలవుతోంది.

సర్కారు గోడౌన్

- నిరుపయోగంగా గోదాములు
- కూటమి సర్కారు నిర్వాకం
- నెలలు గడుస్తున్నా.. ప్రారంభించని వైనం
- గత ప్రభుత్వ హయాంలో 44 మల్టీపర్పస్ గిడ్డంగుల నిర్మాణం పూర్తి
- కేవలం ఏడు గోడౌన్లే వినియోగంలోకి..
- ధాన్యం నిల్వలకు ఇబ్బందులు పడుతున్న రైతులు
- వర్షాల నేపథ్యంలో సర్కారు తీరుపై నిరసన



బెల్లంకొండలో నిరుపయోగంగా ఉన్న మల్టీపర్పస్ గోడౌన్

బెల్లంకొండ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించి, ప్రారంభించిన బహుళ ప్రయోజన గోడౌన్లపై కూటమి ప్రభుత్వం విషం చిమ్ముతోంది. రాజకీయ కారణాలతో వాటిని వినియోగంలోకి తీసుకురావడం లేదు. కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదునెలలైనా అవి నిరుపయోగంగానే ఉన్నాయి. ఫలితంగా ప్రస్తుతం ఖరీఫ్ సీజన్లో పండించిన పంటల నిల్వకు రైతులు అవస్థలు పడుతున్నారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో తమ పంటలను ఎక్కడ దాచుకోవాలని సర్కారు తీరుపై నిరసిస్తున్నారు.

రైతు పక్షపాతిగా గత ప్రభుత్వం..

టీడీపీ కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శలు అన్ని వర్గాల నుంచి వెల్లువెత్తుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పేరొందింది. రైతులకు అన్ని విధాలుగా చేయూతనిచ్చేందుకు రైతు భరోసా కేంద్రాలను నిర్మించింది. సీజన్‌కు ముందే కర్షకులకు పెట్టుబడి సాయం అందజేస్తూ ఆరుగాలం అండగా నిలిచింది. పంటల నిల్వకు రూ.లక్షలు వెచ్చించి సహకార సంఘాల పరిధిలో మల్టీపర్పస్ గోడౌన్లను నిర్మించింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్మాణం పూర్తయిన గోడౌన్లను వినియోగంలోకి తీసుకురాకుండా తాత్సారం చేస్తోంది.

పల్నాడు జిల్లా వ్యాప్తంగా..

జిల్లా వ్యాప్తంగా 60 వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. పలు సంఘాల పరిధిలో గత ప్రభుత్వ హయాంలో 44 మల్టీపర్పస్ గోడౌన్లను నిర్మించారు. వీటిలో నాదెండ్ల మండలం సాతులూరు, శావల్యాపురం మండలం వేల్పూరులో 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో, మిగిలిన 42 చోట్ల 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోడౌన్లను నిర్మించారు. 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్‌ను రూ.40 లక్షలు, 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గిడ్డంగులను రూ.75 లక్షల చొప్పున ఖర్చు చేసి అన్ని వసతులతో నిర్మించారు. ఈ 44 గోడౌన్లలో ప్రస్తుతం గుడిపూడి, మండేపూడి, కారుమంచి, కోతలూరు, వేల్పూరు, కొండ్రముట్ల, ఇనిమేళ్ళ గ్రామాలలో నిర్మించిన ఏడు గోడౌన్లు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. వీటిని గత ప్రభుత్వమే వినియోగంలోకి తీసుకొచ్చింది. మిగిలిన 37 గోడౌన్లను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తోంది.

వినియోగంలోకి తెస్తే రైతులకు మేలు..

ఈ గోడౌన్లను వినియోగంలోకి తీసుకొని వస్తే రైతులకు మేలు జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్లో పత్తి, కంది, మినుములు, వేరుశనగ వంటి పంటలను సాగు చేశారు. ఇప్పటికే వరి కోతలు ప్రారంభమై నూర్పిళ్లు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల పంటలను నిల్వ చేసుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని నిర్మాణాలు పూర్తయిన గోడౌన్లను వినియోగంలోకి తెచ్చి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

గోడౌన్లను వెంటనే ప్రారంభించాలి



రైతులు పండించిన ధాన్యంతోపాటు ఎరువులు నిల్వ చేసుకునేందుకు నిర్మించిన గోడౌన్లను వెంటనే వినియోగంలోకి తీసుకుని రావాలి. ఖరీఫ్ పూర్తయిన సమయంలో రైతులకు గిడ్డంగులు అందుబాటులో ఉంటే వారికి మేలు జరుగుతుంది. గోడౌన్లను వెంటనే ప్రారంభించాలి.

– మర్రి ప్రసాదరెడ్డి, నందిరాజుపాలెం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, బెల్లంకొండ

రైతుల కోసం సిద్ధంగా ఉంచుతాం

పంట దిగుబడులను నిల్వ చేసుకునేందుకు రైతులు గోడౌన్లను వినియోగించుకోవచ్చు. ఇప్పటికే ఖాళీగా ఉన్న వాటిని వినియోగించుకునేందుకు మొదటి ప్రాధాన్యం రైతులకు ఇచ్చాక మిగిలిన వాటిని ప్రభుత్వ శాఖలకు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. కొన్నిచోట్ల పౌర సరఫరాల శాఖతోపాటుగా డీసీఎంఎస్ వారు వినియోగించుకోవాలని కోరాం. వారు గోడౌన్లను పరిశీలిస్తున్నారు.

– వెంకట రమణ, జిల్లా సహకార శాఖాధికారి, పల్నాడు జిల్లా

కత్తులతో 'వీర'ంగం



వీరుల గుడిలో కత్తి సేవలు చేస్తున్న వీరాచారులు

- ఉప్పొంగిన వీరావేశం
- ముగిసిన రాయబార ఉత్సవ ఘట్టం
- పాల్గొన్న ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి



వీరుల గుడికి తరలివస్తున్న వీరాచారులు

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో వీరాచారులు కత్తులతో వీరంగమాడారు. అలనాటి పౌరుష పరాక్రమాలను తలుచుకుని వీరావేశంతో ఊగిపోయారు. వీర మహిళలూ పూనకాలతో పులకించిపోయారు. మెడలో వీరతాళ్లు, చేతుల్లో ఆనాటి ఆయుధాలతో రణక్షేత్రంలో కలియతిరిగారు. ఆయుధాల గంటల సవ్వడితో కారెంపూడి పరవశించింది. పల్నాటి వీరారాధన ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాయబారం ఘట్టం ఉత్సాహంగా సాగింది. వీరాచారులు నాగులేరు ఒడ్డున రంగురంగుల ముగ్గులు పెట్టారు. వీర తాళ్లు, కత్తులను, ఆయుధాలను, వీర్లంకమ్మ బుట్టలను నాగులేరులో శుభ్రపరిచి ముగ్గు మధ్యలో ఉంచారు. కొబ్బరి కాయలు కొట్టి క్రతువులు నిర్వహించారు. ఆయుధాల చుట్టూ వీరంగమాడారు. తర్వాత ఆయుధాలతో తయారు చేసుకున్న నైవేద్యాలతో వీరుల గుడి నుంచి సంప్రదాయ డోలు, సన్నాయి మేళంతో గ్రామోత్సవం నిర్వహించారు. చెన్నకేశవస్వామి, వీర్ల అంకాలమ్మ తల్లిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకుని కత్తి సేవలు చేసుకున్నారు. తర్వాత బ్రహ్మనాయుడు విగ్రహానికి పూలమాలలు, ధూపం వేసి కత్తి సేవ చేశారు. కోట బురుజు మీదుగా పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఇంటికి చేరి కత్తి సేవలు నిర్వహించారు. అనంతరం వీరుల గుడికి చేరుకుని ఆయుధాలను గుడిలో ఉంచారు. ఈ ఆయుధాలను దర్శించుకోడానికి భారీగా ప్రజలు తరలివస్తున్నారు. రాత్రి వీరుల గుడిలో రాయబారం కథాగానాన్ని వీర విద్యావంతులు ఆలపించారు.

ఎంపీ, ఎమ్మెల్యే పూజలు

పల్నాటి ఉత్సవాలలో నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి పాల్గొన్నారు. మొదట వీరుల గుడిలో ఆయుధాలకు పూజలు చేశారు. అనంతరం చెన్నకేశవస్వామి, అంకాలమ్మ ఆలయాలలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు పాల్గొన్నారు.

నేడు చాపకూడు అమలు

ఉత్సవాలలో భాగంగా సోమవారం మంద పోరు ఘట్టం జరగనుంది. ఈ రోజు బ్రహ్మనాయుడు చాపకూడు సిద్ధాంతాన్ని అమలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. సహపంక్తి భోజనాల ద్వారా సమతావాదాన్ని చాటిన బ్రహ్మనాయుడు ఆదర్శాన్ని అమలు చేయనున్నారు. వీరుల గుడి ఆవరణలోని బ్రహ్మనాయుడు చాపకూడు మండపం ఆవరణలో వేలాది మందికి భోజనాలు పెట్టనున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రభుత్వ పెద్దలు, కలెక్టర్, ఎస్పీ పాల్గొనే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.

పోలీస్.. జీ'ఖేల్'



క్రికెట్ పోటీల్లో విజేత నరసరావుపేట జట్టు ప్రతినిధి డీఎస్పీ నాగేశ్వరరావుకు ట్రోఫీ అందజేస్తున్న ఐజీ త్రిపాఠి

- ముగిసిన జిల్లా పోలీస్ స్పోర్ట్స్ మీట్
- ఓవరాల్ చాంపియన్ ఆర్మ్‌డ్ రిజర్వ్ జట్టు
- టగ్ ఆఫ్ వార్ విజేత ఎస్పీ జట్టు
- బహుమతి ప్రదానోత్సవంలో గుంటూరు రేంజ్ ఐజీ త్రిపాఠి




పోటీల ముగింపు ఉత్సవంలో మాట్లాడుతున్న గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి

నరసరావుపేట: క్రీడలతో ఆరోగ్యం సిద్ధిస్తుందని, పోలీసులు చురుగ్గా విధులు నిర్వహించగలుగుతారని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పేర్కొన్నారు. స్థానిక కోడెల శివప్రసాదరావు స్టేడియం(డీఎస్ఏ) మైదానంలో శనివారం నుంచి ప్రారంభమైన పోలీస్ స్పోర్ట్స్ మీట్ ఆదివారం సాయంత్రం ముగిసింది. ఈ మీట్‌లో ఓవరాల్ చాంపియన్‌గా జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు జట్టు నిలిచింది. వ్యక్తిగత చాంపియన్‌గా గురజాల సబ్ డివిజన్ వెల్దుర్తి ఎస్ఐ షేక్ సమందర్‌ఆలీ, ఏఆర్ కానిస్టేబుల్ నాగరాజు నిలిచారు. టగ్‌ఆఫ్‌వార్‌లో జిల్లా ఎస్పీ జట్టు గెలుపొందింది. ఈ సందర్భంగా నిర్వహించిన పోలీస్ వార్షిక గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా గుంటూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి హాజరై మాట్లాడారు. పోలీసులు నిత్యం వ్యాయామం చేయాలని, శారీరక దారుఢ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరూ క్రీడాస్ఫూర్తిని చాటాలని చెప్పారు. విధుల్లో సమన్వయంతో పనిచేస్తే మనదే పైచేయి అవుతుందని వివరించారు. పోలీసు సిబ్బంది ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

ఆద్యంతం ఉత్సాహంగా

అంతకుముందు జరిగిన క్రీడాపోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. ఆదివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లను ఐజీ త్రిపాఠి, జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా డీఎఫ్ఓ కృష్ణప్రియ తిలకించారు. పోలీసు అధికారులతో నిర్వహించిన టగ్ ఆఫ్ వార్ పోటీలో పాల్గొన్న క్రీడాకారులను ఐజీ దగ్గరుండి ప్రోత్సహించారు. అనంతరం మూడు పోలీస్ సబ్ డివిజన్ల పోలీసు సిబ్బంది మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఐజీకి గౌరవ వందనం చేశారు. స్పోర్ట్స్ మీట్‌లో విజేతలుగా నిలిచిన జట్టు సభ్యులు, ఇతర విజేతలకు ఐజీ, ఎస్పీ జేసీ, డీఎఫ్ఓ ట్రోఫీలు, మెడల్స్, మెమెంటోలు అందచేశారు. స్పోర్ట్స్ మీట్‌కు ప్రతీకగా సూచించే పోలీస్ పతాకాన్ని క్రీడాకారులు ఐజీకి అందించారు. ఈ స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించిన అధికారులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు, పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ మెమెంటోలను అందజేసి అభినందించారు. ఆ తర్వాత ఉత్సాహంగా క్యాంప్ ఫైర్ నిర్వహించారు. అదనపు అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పీ సత్తిరాజు, సత్తెనపల్లి, నరసరావుపేట డీఎస్పీలు ఎం.హనుమంతరావు, కె.నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ మహాత్మ గాంధీరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కేవీడీ రామారావు, జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 2210 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 244 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 44 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 57 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 188 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 1179 క్యూసెక్కులు విడుదల చేశారు.

సంసారం.. ఓ చధరంగం

- ఉల్లి ఘాటు.. వెల్లుల్లి పోటు
- కూరగాయల ధరలూ ఎగబాకుతున్న వైనం
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న వినియోగదారులు
- ధరల నియంత్రణను పట్టించుకోని ప్రభుత్వం



సత్తెనపల్లి: ఉల్లి ఘాటుతో వినియోగదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కిలో ఉల్లి ధర రూ.120కి చేరింది. కిరాణా దుకాణాలకు వెళ్లే వినియోగదారులు ఉల్లి వైపు చూడాలంటేనే భయపడుతున్నారు. సగం మంది ఉల్లి కొనకుండానే మిగతా సరుకులతో సరిపెట్టుకుంటున్నారు. కొనేవాళ్లూ పావుకిలో, అర కిలో అంటూ పరిమితంగానే కొంటున్నారు. ఉల్లి ధరలు పెరిగాయనే ప్రచారాన్ని అడ్డం పెట్టుకొని స్థానిక వ్యాపారులు ధరలను ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నారు. ఉల్లి దారిలోనే వెల్లుల్లి కూడా కిలో రూ.350 నుంచి రూ.500 పలుకుతుండడంతో బెంబేలెత్తిపోతున్నారు. వీటితోపాటు కూరగాయల ధరలూ మండిపోతున్నాయి. కిలో రూ.60కి తక్కువగా ఏ కూరగాయ లభించడం లేదు. కొన్ని రకాలు రూ.80 చెల్లిస్తే గానీ దొరకడం లేదు. ఆకుకూరలూ కట్ట రూ.15 వంతున పలుకుతున్నాయి.

దిగుబడి లేకే..

కావాల్సిన సమయంలో వర్షాలు లేకపోవడం, అవసరం లేని సమయంలో అకాల వర్షాల వల్ల దిగుబడులు పడిపోవడంతో రోజురోజుకు ధరలు కొండెక్కి దిగనంటున్నాయి. పంట పండించిన రైతులకు అంతంత మాత్రం ధరలే దక్కుతున్నా వ్యాపారులకు మాత్రం కాసులు కురిపిస్తున్నాయి. సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలు, దినసరి వేతనంపై జీవించే వారిపై మితిమీరిన భారం పడుతుంది. రెక్కల కష్టంతో ఆర్జించిన అంతంత మాత్రం కూలి సొమ్ము ఖర్చులకే చాలడం లేదంటున్నారు. నలుగురు సభ్యులు ఉన్న కుటుంబాల వారు కూరగాయల కొనాలంటే మూడురోజులకు కనీసం రూ.400–500 వెచ్చించాల్సి వస్తోందంటూ వాపోతున్నారు.

సత్తెనపల్లిలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర (రూ.లలో)
టమాటా	60.00
బీరకాయలు	60.00
ముల్లంగి	70.00
కాకరకాయలు	60.00
చికుడు కాయలు	80.00
బంగాళదుంపలు	50.00
క్యారెట్	65.00
బీన్స్	80.00
క్యాప్సికం	80.00

నియంత్రణకు సర్కారు చర్యలేవీ?

ధరల నియంత్రణకు సర్కారు చర్యలు తీసుకోవడం లేదు. గతంలో ఉల్లి ధర పెరిగినప్పుడు ప్రభుత్వం సబ్సిడీ దుకాణాలు తెరిచేది. మొబైల్ వాహనాలతో రాయితీ ధరకు ఉల్లిపాయలు అమ్మేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

దళారులకే లాభం

ధరల పెరుగుదల వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. వారి నుంచి కొనే దళారులు మాత్రం రెట్టింపు ధరలకు అమ్ముకుంటూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దళారుల ఆటలు అరికట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ఏఎన్‌యూలో కొనసాగిన కమిటీ విచారణ

- విద్యార్థినులు, సిబ్బంది, అధికారులతో వేర్వేరుగా సమావేశాలు
- సమస్యలపై కమిటీ ముందు గళం విప్పిన విద్యార్థినులు
- కలుషిత ఆహారం, నీరుతోపాటు పరిసరాల అపరిశుభ్రతపై ఫిర్యాదు



సమావేశం అనంతరం బయటకు వస్తున్న తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళా వసతి గృహంలో భోజనంలో పురుగులు, జెర్రి, కప్ప వంటివి వచ్చాయని విద్యార్థినులు చేపట్టిన నిరసనపై ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ ఆదివారం కూడా యూనివర్సిటీలో పర్యటించింది. విద్యార్థినులు, సిబ్బంది, అధికారులతో వేర్వేరుగా కమిటీ సమావేశమైంది. విచారణ కమిటీ సభ్యులైన తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి పద్మజ, ఫుడ్ సేఫ్టీ అధికారి రవీందర్ రెడ్డిలు విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు తమ ఇబ్బందులపై గళం విప్పారు. తమకు పెట్టే భోజనంలో గాజు పురుగులు, జెర్రి, కప్పలాంటివి వస్తున్నాయని వాపోయారు. తాగునీటితోపాటు వినియోగించే నీరు కలుషితంగా ఉందని వెల్లడించారు. వాటర్ ట్యాంకుల నీటిలో తల వెంట్రుకలు ఉండడంతోపాటు వంట తయారు చేసే పరిసరాలు నాచుతో అపరిశుభ్రంగా ఉంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్యలను పలుమార్లు చీఫ్ వార్డెన్‌కు చెప్పామని తెలిపారు. ఆమె వాటిని పరిష్కరించకపోగా, తమపై బెదిరింపులకు పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహాల్లో ఆహారం తినలేక కొందరు ఇళ్లకు వెళ్లిపోయారని తెలిపారు. చీఫ్ వార్డెన్, ఇతర వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని కమిటీని కోరారని సమాచారం. అనంతరం కమిటీ సభ్యులు అక్కడి సిబ్బందితో సమావేశం అయ్యారు. అనంతరం వసతి గృహాలు, యూనివర్సిటీ అధికారులతో కూడా వేర్వేరుగా భేటీలు నిర్వహించారు. చివరిగా మరోమారు విద్యార్థినులతో సమావేశం అయ్యారు. అన్ని అంశాలతో కమిటీ సోమవారం ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.

క్లుప్తంగా

వక్ఫ్ చట్ట సవరణ నిలిపివేతకు డిమాండ్



లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన వక్ఫ్ చట్ట సవరణను నిలుపుదల చేయాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సెక్రటరీ ఉమ్రైన్ మెహఫూజ్ రెహమాని డిమాండ్ చేశారు. పొన్నూరు రోడ్డులోని మజ్లీస్ ఉలేమా ఆధ్వర్యంలో ఆదివారం ముస్లిం మేధావుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్రం తక్షణమే 1991 వక్ఫ్ చట్టం కొనసాగించాలని తెలిపారు. దేశ వ్యాప్తంగా వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలపై తమ అభ్యంతరాలు తెలిపారు. కేంద్రం తీసుకువచ్చిన ఈ ప్రతిపాదన వల్ల వక్ఫ్ బోర్డు నిర్వీర్యం అవుతుందన్నారు. ఈ చర్య ముస్లిం వర్గ హక్కులు, మనోభావాలు దెబ్బతీనేలా ఉందన్నారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లు అత్యంత ప్రమాదకరమైనదని, దీనివల్ల ముస్లింల భూములు అన్యాక్రాంతమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా మజ్లీసుల్ ఉలమా అధ్యక్షులు ముఫ్తి బాసిత్, ముఫ్తి ముజాహిద్, ముఫ్తి అబ్దుల్ ఖవి రషాది, మౌలానా ఇస్మాయిల్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

కొల్లిపరలో అత్యధికంగా 9.2 మి.మీ. వర్షపాతం

కొరిటిపాడు (గుంటూరు): గుంటూరు జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 9.2 మిల్లీ మీటర్లు వర్షపాతం పడింది. అత్యల్పంగా వట్టిచెరుకూరు మండలంలో 1.6 మి.మీ.కురిసింది. సగటు 4.6 మి.మీ.గా నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు.. మేడికొండూరు 8.2, దుగ్గిరాల 6.8, ఫిరంగిపురం 6.8, పెదకాకాని 6.2, గుంటూరు తూర్పు 5.6, గుంటూరు పశ్చిమ 5.2, తుళ్ళూరు 4.4, మంగళగిరి 4.2, తాడేపల్లి 4.2, చేబ్రోలు 3.6, తాడికొండ 3.4, ప్రత్తిపాడు 3.2, పొన్నూరు 2.8, తెనాలి 2.8, పెదనందిపాడు 2.4, కాకుమాను మండలంలో 2 మి.మీ. చొప్పున పడింది.

బైరాగి సాహిత్యంతోనే ఈ స్థాయికి చేరా

డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

తెనాలి: ఒక వ్యక్తి సాహిత్యంతో ఎవరైనా పూర్తిగా మారిపోవటం అరుదని, అది తన జీవితంలో జరిగిందని రాజ్యసభ మాజీ సభ్యుడు, హిందీ అకాడమీ విశ్రాంత చైర్మన్ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చెప్పారు. తాను ఈ స్థాయికి రావటానికి కారణం మహాకవి ఆలూరి బైరాగి సాహిత్యమేనని తెలిపారు. తెనాలికి చెందిన ప్రసిద్ధ కవి ఆలూరి బైరాగి శత జయంతి ప్రారంభ సభను ఆదివారం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో నిర్వహించారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ సభకు అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. అరసం కవితా స్రవంతిలో భాగంగా తీసుకొచ్చిన 'ఆలూరి బైరాగి కవిత' పుస్తకాన్ని డాక్టర్ లక్ష్మీప్రసాద్ ఆవిష్కరించారు. కాలేజీలో విద్యార్థి నాయకుడిగా ఉద్యమించే రోజుల్లో తన గురువు ఆదేశ్వరరావు ద్వారా బైరాగి కవిత పరిచయమైందన్నారు. పీజీలో బైరాగి సాహిత్యంపై లఘు సిద్ధాంత వ్యాసం రాశానని చెప్పారు. అధ్యాపకుడిగా చేస్తున్నపుడు బైరాగి చివరి రోజుల్లో స్వయంగా ఆయనకు చూపించి సంతకం తీసుకున్నట్టు గుర్తు చేసుకున్నారు. బైరాగి కవిత్వం కాలం గడిచేకొద్దీ మరింతగా సౌరభాలు



ఆలూరి బైరాగి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న దృశ్యం

వెదజల్లుతుందని తెలిపారు. ఆయన సాహిత్యం విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాలని ఆకాంక్షించారు. తిక్కన పదకోశంలానే బైరాగి పదకోశం చాలా అవసరమని చెప్పారు. తెనాలిలో ప్రతిష్ఠించేందుకు బైరాగి విగ్రహాన్ని సమకూరుస్తామని హామీనిచ్చారు. సభాధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం కలిగిన తెనాలికి చెందిన ఆలూరి బైరాగి మరణం తర్వాత కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందని చెప్పారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ తన ప్రసంగంలో పొరుగు రాష్ట్రాల్లో విస్తృతమవుతున్న గ్రంథాలయోద్యమం, పుస్తక పఠనం పెంపుపై మన రాష్ట్రంలోనూ కృషి జరగాలని అభిప్రాయపడ్డారు. గ్రంథాలయాలకు కొనుగోలు చేసిన పుస్తక రచయితలకు చెల్లించాల్సిన నిధుల విడుదలకు డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట సాయం చేయాలన్నారు. కనపర్తి బెన్‌హర్ స్వాగతం పలికిన ఈ సభలో డాక్టర్ లక్ష్మీప్రసాద్‌ను తొలుత ప్రముఖ కవి బండ్ల మాధవరావు పరిచయం చేశారు. అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. తొలుత బైరాగి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

న్యూ కేటగిరి ఎడ్ల పందేల విజేత సంతమాగులూరు

రణక్షేత్రంలో ఉత్సాహంగా ఎడ్ల బండ లాగుడు పోటీలు

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాల సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో న్యూ కేటగిరి (సేద్యం) విభాగం ఎడ్ల బండ లాగుడు పోటీలను ఆదివారం నిర్వహించారు. పోటీలను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన వజ్రాల తేజ శ్రీరెడ్డి ఎడ్ల జత 4,200 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. హైదరాబాదుకు చెందిన డి.రోషన్‌బాబు ఎడ్లజత 4,159 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. పెదకాకాని మండలం, కొప్పురావూరుకు చెందిన తోట శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్రం మేళ్ల చెరువుకు చెందిన కొప్పు గోవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డిల ఉమ్మడి జత తృతీయ స్థానాన్ని సాధించింది. కృష్ణా జిల్లా గన్నవరం మండలం తెంపల్లికి చెందిన కొలుసు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు జత నాలుగో స్థానంలో, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీష్ చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత ఐదో స్థానంలో పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం కుందూరువారిపాలెంకు చెందిన బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి ఎడ్ల జత ఆరో బహుమతిని దక్కించుకున్నాయి. విజేతలకు కారెంపూడి ఆటో, ఎంప్లాయిస్ ఫైనాన్స్ అసోసియేషన్, దేవదాయ శాఖ, గంటా నరసింహారావు, శ్రీనివాసరావు, కోరె శ్రీనివాసరావు, బొమ్మిన వెంకయ్య అండ్ సన్స్, శ్రీసాయి సూపర్ మార్కెట్ బట్టల కొట్టు సైదా సాహెబ్, కరిముల్లా సాహెబ్‌లు నగదు



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

బహుమతులు అందించారు. పోటీలను కారెంపూడి రైతు సంఘం నిర్వహిస్తోంది.

ఎడ్ల పోటీల విజేతలకు బహుమతుల పెంపు

పల్నాటి ఉత్సవాల సందర్భంగా జరుగుతున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీల నగదు బహుమతులను పెంచినట్లు కారెంపూడి రైతు సంఘం ప్రతినిధులు ఆదివారం సాయంత్రం ప్రకటించారు. పశుపోషకుల ఖర్చులతోపాటు వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బహుమతులు పెంచినట్లు వెల్లడించారు. నాలుగో తేదీ జరగనున్న సీనియర్స్ విభాగంలో ఆరు బహుమతులు ప్రకటించారు. అవి వరుసగా రూ.75 వేలు, 60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ. 10 వేలు ప్రకటించారు. అలాగే మూడో తేదీ జరగనున్న జూనియర్స్ విభాగంలో కూడా ఆరు బహుమతులు ప్రకటించి వాటిని కూడా పెంచారు. అవి వరుసగా రూ.50 వేలు, రూ.35 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు ప్రకటించారు. అలాగే రెండో తేదీ జరగనున్న సబ్ జూనియర్స్ విభాగం బహుమతులు కూడా పెంచినట్లు పేర్కొన్నారు.

ఓబీసీల 'చలో ఢిల్లీ' జయప్రదం చేయాలి

ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

తెనాలి: కేంద్రప్రభుత్వం వచ్చే జనవరి నుంచి చేపట్టనున్న జనగణనతోపాటు సమగ్ర కుల గణన జరపాలనే డిమాండ్‌తో ఈ నెల 5, 6వ తేదీల్లో జాతీయ స్థాయిలో ఓబీసీలు నిర్వహిస్తున్న 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. 5న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా, 6న అఖిలపక్ష సమావేశానికి రాష్ట్రంలోని బీసీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. స్థానిక బృందావన హోటల్ సమావేశ మందిరంలో బీసీ నాయకులతో కలిసి ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాదిగా ఓబీసీలు పెత్తందారీవర్గాల అణచివేతకి గురవుతున్నట్టు చెప్పారు. ఓబీసీల సమగ్ర అభివృద్ధితోనే దేశాభివృద్ధి ముడిపడి ఉందన్నారు. కులగణనకు దేశంలోని అన్ని పార్టీలు సుముఖంగా ఉన్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ నాయకులు సమగ్ర కులగణన చేపడితే జాతీయ సమగ్రత దెబ్బతింటుందని చెప్పటం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించాలని, జనాభా దామాషా ప్రకారం ఓబీసీల రిజర్వేషన్లు పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కుర్రా శ్రీను, ఓలేటి శివాజీ, వేముల కృష్ణ, కొల్లూరు హనుమంతరావు, పి.లక్ష్మీనారాయణ, ఎం.పూర్ణచంద్రరావు, కాళిదాసు, ధనుష్, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేసన శంకరరావు

సోషల్ మీడియా యాక్టివిస్ట్ సంజీవరెడ్డికి రిమాండ్

చిలకలూరిపేట: అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలం నక్కలపల్లి గ్రామానికి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్ట్ యు.సంజీవరెడ్డిని చిలకలూరిపేట రూరల్ పోలీసులు ఆదివారం పోలీసు కస్టడీకి తీసుకొని విచారణ చేశారు. రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు తెలిపిన వివరాల ప్రకారం చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలి ఈ ఏడాది ఆగస్టు 28న సంజీవరెడ్డి, మరో ఎనిమిది మందిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. సీఎం నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులపై పోస్టులు పెట్టారంటూ కేసు నమోదు చేశారు. మరో కేసులో సత్యవేడు జైలులో ఉన్న సంజీవరెడ్డిని చిలకలూరిపేట రూరల్ పోలీసులు కస్టడీకి తీసుకొని న్యాయవాది వినయ్‌కుమార్ సమక్షంలో విచారించి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరిచారు. న్యాయమూర్తి రిమాండ్ విధించటంతో నరసరావుపేట సబ్‌జైల్‌కు తరలించారు.

సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల నిరసన

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు ఆదివారం పోరాట శిబిరం నుంచి ప్రకాష్ నగర్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ.. శనివారం అక్రమంగా కార్మికుల గుడిసెలను కూల్చివేశారని పేర్కొన్నారు. దీనికి నిరసనగా ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్మికుల న్యాయమైన పోరాటానికి అధికారులు మద్దతు ఇవ్వాలని కోరారు. కోర్టు తీర్పుల ప్రకారం కార్మికులకు నష్టపరిహారం ఇవ్వకుండా జాప్యం చేయడం తగదన్నారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా, ముందస్తు సమాచారం లేకుండా గుడిసెలను కూల్చివేయడం సరికాదని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ, రూరల్ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు, పల్లె కృష్ణ, దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొట్టే కరుణాకర్ రావు, సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, బి.ప్రకాష్, ఆశీర్వాదం, బి. వెంకయ్య, సాంబశివరావు, యెహోషువా, బాషా, రమాదేవి, ఎం.శారద, సారమ్మ, సామ్రాజ్యం, హిమాంబి, దుర్గమ్మ, నాని, నాగేశ్వరరావు, సుబ్బారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు

మహిళలు బట్టతలకు మాత్రలు వాడొచ్చు

డాక్టర్ రుచిత దూరత్

గుంటూరు మెడికల్: బట్టతల నివారణకు ఇప్పటి వరకు అందరూ లోషన్ వాడుతున్నారని, ముఖ్యంగా మహిళల్లో బట్టతల నివారణకు మినాక్సిడిల్ మాత్రలు వాడటం వల్ల ప్రయోజనం ఉంటుందని ప్రముఖ స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్ రుచిత దూరత్ అన్నారు. గుంటూరు శ్రీ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్న ఐఏడీవీఎల్ ఆంధ్రప్రదేశ్ బ్రాంచ్ 43వ వార్షిక సదస్సు ఆదివారం ముగిసింది. నిరంతర వైద్య విద్య కార్యక్రమం (సీఎంఈ)లో భాగంగా డాక్టర్ రుచిత దూరత్ మాట్లాడుతూ.. బట్టతల నివారణకు ఈ మాత్రలు పురుషులు, స్త్రీలు వాడొచ్చని చెప్పారు. జుట్టును బాగా లాగి గట్టిగా జడ వేయటం ద్వారా వెంట్రుకలు రాలిపోతాయన్నారు. డెర్మటాలజీలో లేజర్ చికిత్స వలన కలిగే ప్రయోజనాలు, ఏ చర్మ సమస్యలకు వీటిని వినియోగించాలనే అంశాలపై డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు. ముఖ సౌందర్యం, కేశాలు పెరిగేందుకు అందుబాటులోకి వచ్చిన ఆధునిక ఇంజెక్షన్లు, వైద్య పద్ధతుల గురించి పలువురు వక్తలు మాట్లాడారు. పేపర్ ప్రజెంటేషన్ పోటీల్లో గుంటూరు వైద్య కళాశాలకు చెందిన డాక్టర్ ఆసియా ఫాతిమాకు ప్రథమ బహుమతి లభించింది. డాక్టర్ ధృతికి బెస్ట్ థీసీస్ ఆన్ సింప్లిఫైడ్ విటిలిగో సర్జరీలో అవార్డును అందజేశారు. తొలుత వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా స్థానిక బృందావన్‌గార్డెన్స్ ఎన్‌టీఆర్ స్టేడియంలో సదస్సు నిర్వహించారు. అసోసియేషన్ జాతీయ సెక్రటరీ డాక్టర్ భూమేష్ కుమార్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. హెచ్‌ఐవీకి ఏ విధంగా వైద్య సేవలు అందించాలి, హెచ్‌ఐవీ సెక్సువల్ డిసీజెస్ గురించి వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ అత్తోట కవిత, రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ సౌజన్య, సదస్సు సైంటిఫిక్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ కె.ఎ.సీతారామ్, కో చైర్‌పర్సన్ డాక్టర్ పి.ఎస్.మోహనరావు, యూనియన్ రాష్ట్ర కోశాధికారి డాక్టర్ నాగేశ్వరరావు, డీఎస్ఎస్ శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.



అవార్డు అందజేస్తున్న డాక్టర్ కవిత, డాక్టర్ సౌజన్య, పక్కన డాక్టర్ సీతారామ్ తదితరులు

నూతన అధ్యక్షుడిగా డాక్టర్ శ్రీనివాసులు...

ఐఏడీవీఎల్ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన డాక్టర్ శ్రీనివాసులు, రాష్ట్ర కోశాధికారిగా తిరుపతికి చెందిన డాక్టర్ సజ్జా ప్రకాష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర సదస్సు ముగింపు సందర్భంగా ఆదివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమర్థ నిర్వహణకుగాను అధ్యక్ష, కార్యదర్శులు కవిత, సౌజన్యకు పలువురు అభినందనలు తెలిపారు.

జీవీ కృష్ణారావు ఆశయ సాధనకు కృషి

లక్ష్మీపురం: కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధి, ముఠా కార్మిక సంఘం అభ్యున్నతి కోసం అంతిమ శ్వాస వరకు పాటుపడిన ఆదర్శ కమ్యూనిస్టు జీవీ కృష్ణారావు అని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తామని తెలిపారు. సంగడిగుంటంలోని రేగుల రాఘవయ్య భవన్‌లో ఆదివారం నగర ముఠా కార్మిక సంఘం, సీపీఐ నగర సమితి, ఏఐటీయూసీ నగర సమితి, జీవీ కృష్ణారావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జీవీ కృష్ణారావు 8వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. జీవీకే చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. అనంతరం రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. జీవీ కృష్ణారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక కార్మిక సంఘాలను నిర్మాణం చేయడమే కాకుండా ఉద్యమాలు నడపడంలో కార్మిక వర్గాన్ని ఐకమత్యంతో ముందుకు తీసుకెళ్లారన్నారు. ఆ సంఘాలు నేటికీ కొనసాగుతున్నాయని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. జీవీ కృష్ణారావు, వారి కుటుంబం కమ్యూనిస్టు భావాలతో పాటు నాస్తికత్వాన్ని, మూఢాచారాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పాలుపంచుకున్నట్లు గుర్తుచేశారు. జీవీ కృష్ణారావు తండ్రి పోలయ్య కూడా ఈ బాటలో విశేష కృషి చేశారన్నారు. దేశంలో బీజేపీ మత రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. జీవీ కృష్ణారావు హేతువాద భావాలు, నాస్తిక సిద్ధాంతాలు సమాజంలో ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఠా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమానికి కృషి చేసిన మహనీయుడు జీవీ కృష్ణారావు అని కొనియాడారు. అనంతరం జీవీ కృష్ణారావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జీవీకే విశిష్ట పురస్కారాన్ని మున్సిపల్ ఫెడరేషన్ సీనియర్ నాయకులు నెక్కంటి సుబ్బారావుకు ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి కళాకారులు అభ్యుదయ గేయాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర అధ్యక్షుడు కోటా మాల్యాద్రి, జీవీకే మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ అమ్మిశెట్టి శివ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ఏఐటీయూసీ నగర గౌరవాధ్యక్షులు జి.సురేష్ బాబు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, కార్పొరేటర్ సంకూరు శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు పులి సాంబశివరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సుబ్బారావుకు పురస్కారం అందిస్తున్న రవీంద్రనాథ్, అజయ్‌కుమార్

చికెన్ కోసం వెళ్లి బాలుడి దుర్మరణం

ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఢీకొన్న లారీ

నరసరావుపేట రూరల్: రోడ్డుప్రమాదంలో బాలుడు దుర్మరణంపాలైన ఘటన మండలంలోని పెట్లూరివారిపాలెంలో ఆదివారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు పెట్లూరివారిపాలెం గ్రామానికి చెందిన మిట్టా కమల్(14) చికెన్ తెచ్చేందుకు ద్విచక్రవాహనంపై కోటప్పకొండకు బయలుదేరాడు. మార్గమధ్యంలో మలుపు వద్ద ఎదురుగా వచ్చిన లారీ కమల్ ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కమల్ అక్కడికక్కడే మృతిచెందాడు. కమల్ ఉప్పలపాడు జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కిశోర్ తెలిపారు.



ఘటనా స్థలంలో బాలుడి మృతదేహం

జీసీటీపీ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

అద్దంకి రూరల్: ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం (జీసీటీపీ) బాపట్ల జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఆదివారం బాపట్ల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. అధ్యక్షుడు, సెక్రటరీలుగా అద్దంకి కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు మహమ్మద్ నయీం, బి. అశోక్ కుమార్, మహిళా సెక్రటరీగా చిలక అనిత, కోశాధికారిగా రేపల్లెకు చెందిన డి. సంపూర్ణరావు ఎన్నికైనట్లు నూతన అధ్యక్షుడు తెలిపారు.

ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించండి

- అసాంఘిక శక్తులను గుర్తించాలి
- పత్రాలు లేని వాహనాలను సీజ్ చేయండి
- సిబ్బందికి జిల్లా ఏఎస్పీ రవికుమార్ సూచన
- నులకపేట, ప్రకాష్‌నగర్‌లలో కార్డన్ సెర్చ్

తాడేపల్లి రూరల్: కార్డన్ సెర్చ్ నిర్వహించే ప్రాంతంలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించాలని గుంటూరు జిల్లా ఏఎస్పీ రవికుమార్ అన్నారు. అసాంఘిక శక్తులు ఎవరైనా ఉంటున్నారా? లేదా? అనేది గమనించాలని సూచించారు. తగిన పత్రాలు లేని వాహనాలను తప్పనిసరిగా సీజ్ చేయాలని పేర్కొన్నారు. ఆదివారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నులకపేట, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. ముందుగా తాడేపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో గుంటూరు సబ్ డివిజన్‌లోని ఐదుగురు సీఐలు, మరో వందమంది సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ.. అసాంఘిక శక్తులు గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించేవారు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పత్రాలు లేని వాహనాలతో సంచరిస్తున్నారని తెలిపారు. అలాంటి వారిని కార్డన్ సెర్చ్ నిర్వహించే సమయంలో సిబ్బంది గుర్తించాలన్నారు. వాహనాలకు సరైన పత్రాలు లేకుంటే తప్పనిసరిగా ఆ వాహనాలను సీజ్ చేయాలని, ఇంటి యజమానులతోపాటు అద్దెకు ఉంటున్న వారి గుర్తింపు కార్డులను పరిశీలించాలని పేర్కొన్నారు. వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చి నివాసముంటున్న వారిని గుర్తించాలని ఆయన అన్నారు. మొత్తం 6 టీమ్‌లను ఏర్పాటు చేసి ప్రకాష్‌నగర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ, తాడేపల్లి సీఐలు కళ్యాణ్ రాజు, నజీర్ బేగ్, మంగళగిరి పట్టణ రూరల్ సీఐలు వినోద్ కుమార్, వెంకటరావు, పెదకాకాని సీఐ నారాయణ స్వామి, నార్త్ సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్డన్ సెర్చ్‌పై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ రవికుమార్, సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ



ప్రకాష్‌నగర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజ్